# ప్రజాపాలనలో అందరికి సమన్యాయం

- రేపటి నుండి పేదోళ్ళ ఇంటివద్దకే అభయ హస్తం
- టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు



కొత్తగూడెం, డిసెంబర్27(కెరటం ప్రతినిధి)

కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద ప్రజలు అంటే ప్రాణమని టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు అన్నారు. ప్రజా పాలనపై నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తలకు కూడా దిశానిర్దేశం చేస్తున్నామని రేపటి నుంచి జనవరి 6 వరకు జరిగే ప్రజా పాలన విజయవంతం చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రతీ కుటుంబానికి అందేలా దరఖాస్తు ఫారాలను ప్రభుత్వమే అందిస్తుందని చెప్పారు. రేపటి నుండి గొప్ప శుభదినం అని ప్రజలకు కావలసిన సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా నిర్భయంగా అందించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందే రాజకీయాలు గ్రామాల్లో ఉండాలని ఆ తర్వాత పేద ప్రజలను ఆదుకు నేందుకు పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత ప్రభుత్వంలా సొంత కార్యకర్తలకే ప్రాముఖ్యత ఉండబోదని ఆ పార్టీ ఈ పార్టీ అనే తారతమ్యాలు లేకుండా అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ లబ్ధి చేకూరే విధంగా చూస్తామని అన్నారు. నిజమైన అర్హులకు పేదలకు వారు ఏ పార్టీ వారైనా సరే అందరికి సంక్షేమం అందాలన్నదే పార్టీ దృక్పదమని స్పష్టం చేశారు. పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు ప్రజా పాలన వచ్చిందని ప్రజా పాలన ఇక మొదలైందని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు దరఖాస్తుతో జత చేయాలని సూచించారు. లబ్ధి పొందడానికి మహాలక్ష్మి పథకం కింద ప్రతినెల మహిళలకు 2500 ఆర్థిక సాయం, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, రైతు భరోసా పథకం కింద రైతులకు ప్రతి ఏటా ఎకరానికి 15000 అదే విధంగా వ్యవసాయ కూలీలకు ఏటా 12 వేల రూపాయలు, ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇల్లు లేని వారికి అర్హులైన కుటుంబానికి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం, అదేవిధంగా అమరవీరుల మరియు ఉద్యమకారుల కోసం 250 గజాల ఇంటి స్థలం, గృహ జ్యోతి పథకం కింద పేద కుటుంబానికి ప్రతి నెల 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, చేయూత పథకం కింద 4000 రూపాయలు పింఛన్, దివ్యాంగులకు 6000 పింఛన్ పొందేందుకు పూర్తిస్థాయిలో ప్రజా పాలన దరఖాస్తులు రూపొందించబడ్డాయని పేర్కొన్నారు. పథకాల పట్ల ప్రజల్లో అనేక సందేహాలు నెలకొన్న విషయాన్ని పరిగణలోకి తీసుకోని అధికారులు సంయమనంతో ప్రజలకు సహకరించి ప్రభుత్వ పథకాలను అందరికి అందించేలా సహకరించాలన్నారు.

# ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి

- అధికారులందరూ తప్పనసరిగా గ్రామ సభలకు హాజరుకావాలి
- జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు
- ప్రజా పాలన నేపథ్యంలో చుంచుపల్లి మండల అధికారులకు సన్నాహక సమావేశం



కొత్తగూడెం, డిసెంబర్27(కెరటం ప్రతినిధి)

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలనపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, అధికారులందరూ తప్పనసరిగా గ్రామ సభలకు హాజరుకావాలని జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు అన్నారు. చుంచుపల్లి మండలంలో జిల్లా ప్రజా పరిషత్ సమావేశం మందిరం నందు గురువారం నుంచి జరగబోవు ప్రజా పాలన గ్రామసభల ముందస్తు సన్నాహక సభ బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సన్నాహక సభ కార్యక్రమమునకు జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, వ్యవసాయ శాఖ చైర్మన్ మండే వీర హనుమంతరావు, చుంచుపల్లి మండల ప్రత్యేక అధికారిని బి సులోచన హాజరుకాగా, ఎంపీడీవో మందా మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ నేతృత్వంలో ఇట్టి సన్నాహక సభ సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశమునకు గ్రామసభల టీం లీడర్లు, మెంబర్లు, అందరు గ్రామపంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, అందరూ మండలాధికారులు , ఏఎన్ఎంలు,ఆశలు, అంగన్వాడీ టీచర్లు సూపర్వైజర్లు, మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు అందరు కూడా హాజరుకాగా రేపటి నుంచి జరగబోవు గ్రామ సభల వివరాలను వివరించి ఏర్పాటు చేయాల్సిన కౌంటర్లు, దరఖాస్తు స్వీకరణ, హెల్ప్ డెస్కులు, మెడికల్ క్యాంపులు, ప్రతి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేయాల్సిన టేబుల సంఖ్య, సిబ్బంది, అప్లికేషన్లు ఏ విధంగా ఫిలప్ చేయాలి ఏ విధంగా ఇవ్వాలి, ఏ విధంగా రసీదు ఇవ్వాలి అనే అంశాలపై సంక్షిప్తంగా సమావేశం ఏర్పాటు చేసి ఒక ట్రైనింగ్ ప్రోగ్రామ్ లాగా వివరించారు.






# పాల్వంచలో టిజోలా ఫుడ్ డెలివరీ యాప్ ప్రారంభం

**ఆన్‌లైన్‌లో ప్రారంభించిన కంపెనీ అధినేత బలుసు సురేష్**



పాల్వంచ, డిసెంబర్27(కెరటం ప్రతినిధి)

ప్రముఖ నగరాలకు పరిమితమైన టిజోలా ఫుడ్ డెలివరీ యాప్ ఇప్పుడు పాల్వంచ పట్టణంలో బుధవారం ప్రారంభమైంది. పాల్వంచ పట్టణ వాసులకు ఇంటి వద్దకే వారికి ఇష్టమైన ఫుడ్‌ను అందించనున్నది ఈ యాప్. లక్షలాది మంది ప్రజలు ఈ యాప్‌ను వినియోగిస్తుండగా.. ప్రస్తుతం పాల్వంచ ప్రాంతంలో సైతం అందుబాటులోకి వచ్చింది. ఈ యాప్‌ను టిజోలా కంపెనీ అధినేత బలుసు సురేష్ ఆన్‌లైన్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ కంపెనీలను సైతం 'ఢీ'కొడుతూ టిజోలా పేరుతో ఫుడ్ డెలివరీ వ్యవస్థని ఏర్పాటు చేశామని, బిజినెస్ రంగంలో ఎదగాలనుకున్న ఎందరో ఔత్సాహికులకు తమ సంస్థ ద్వారా ఫ్రాంఛైజీలు ఇచ్చి తమ వ్యాపారంలో భాగస్వాములను చేస్తూ వారి కలలకు కార్యరూపం దాలుస్తున్నామని తెలిపారు. రెండేండ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ ఫుడ్ డెలివరీ యాప్ ఇప్పటి వరకు దాదాపు 3లక్షలకు పైగా ఆర్డర్లు చేసిందని, దాదాపు రెండు లక్షలకు పైగా ఈ యాప్‌ను వినియోగిస్తున్నారని తెలిపారు. రుచికరమైన... కస్టమర్లకు ఇష్టమైన ఫుడ్‌ను వేగంగా.. చేరువచేసేలా ఈ యాప్‌ను రూపొందించడం జరిగిందని, పాల్వంచ పట్టణ వాసులు ఈ అవకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా మొదటి మూడు డెలివరీలపై 25 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని, పాల్వంచ పట్టణ వాసులు టిజోలా ఫుడ్ డెలివరీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిజోలా ఫుడ్ డెలివరీ యాప్ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కొత్తగూడెం సింగరేణి ఎన్నికలు

**ప్రచారంలో పాల్గొన్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల**

కొత్తగూడెం, డిసెంబర్27(కెరటం ప్రతినిధి)

సింగరేణి కార్మిక ఎన్నికల సందర్భంగా కొత్తగూడెంలో సింగరేణి కార్పొరేట్ ఏరియాలోని ప్రధాన కార్యాలయం, మెయిన్ వర్క్‌షాప్, మెయిన్ హాస్పిటల్ ప్రాంతాల్లో బుధవారం డీసీఎంఎస్ వైస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు కార్మికులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్మికుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోరాడేది కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘమైన ఐఎన్‌టియూసి ఒక్కటేనని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కార్మిక సమస్యల పరిష్కారం ఐఎన్‌టియూసి వలన సులభతరం అవుతుందని కొత్వాల అన్నారు. కావున కార్మికులు ఐఎన్‌టియూసికి మద్దతు తెలిపి, గడియారం గుర్తుకు ఓట్లు వేయాలని కొత్వాల కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, ఐఎన్‌టియూసి జిల్లా నాయకులు ఎస్.ఏ జలీల్, పాల్వంచ పట్టణ మండల అధ్యక్షులు నూకల రంగారావు, కోండం వెంకన్న, కాంగ్రెస్ నాయకులు బద్ది కిషోర్, బత్తుల వెంకటేశ్వరావు, కందుకూరి రాము, మాలోత్ కోటి, భట్టు మురళి, చాంద్ పాషా, వీరు నాయక్, సూర్య కిరణ్, అంబేద్కర్, శాంతి వర్ధన్, పాబోలు నాగేశ్వరరావు, నాగిరెడ్డి, విజయ్, వజ్జల రాము, స్వాతి రెడ్డి, అరుణ, రాము, కొండల రావు, దేవేందర్, కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.